
నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
13 | హైదరాబాద్, మంగళవారం 23 జనవరి 2024 | SANGAREDDY





మల్లికార్జున స్వామి ఆలయ రాజగోపురం వద్ద వేచి ఉన్న భక్తులు



ఉత్సవ విగ్రహాలు తీసుకొస్తున్న ఆలయ ప్రధానార్చకుడు, చైర్మన్, కమిటీ సభ్యులు

శంఖు ఊదుతున్న సాధువు

కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో అగ్నిగుండం, పెద్దపట్నం తొక్కేందుకు వచ్చిన హైదరాబాద్ శివసత్తులు, జోగినిలు, భక్తులు

# భక్తజనం.. బండారి మయం

- భక్తిశ్రద్ధలతో పెద్ద పట్నం
- ఉత్కంఠభరితంగా అగ్నిగుండాలు
- కోరమీసాల స్వామికి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

**పసుపుమయంగా మల్లికార్జునుడి క్షేత్రం**

పట్నం వారం సందర్భంగా కొమురవెల్లి మల్లన్న క్షేత్రం పసుపువర్ణ శోభితమైంది. భక్తులు చల్లుకున్న పసుపుతో స్వామివారి సన్నిధి పసుపుమయమైంది. పంచవర్ణాల పెద్ద పట్నాన్ని దాటుకుంటూ అగ్నిగుండ ప్రవేశం చేస్తూ మేడలమ్మ, కేతమ్మ సమేత మల్లికార్జునుడిని దర్శించుకొని భక్తులు తన్మయత్వం పొందారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవస్థానం వద్ద పెద్దపట్నం, అగ్ని గుండాల కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

చేర్యాల, జనవరి 22 : పట్నం వారం సందర్భంగా సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న క్షేత్రం పసుపుమయంగా మారింది. హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయవర్గాల సహకారంతో సోమవారం పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమం వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అగ్నిగుండాలను దాటే కార్యక్రమం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. పెద్దపట్నం చూసిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. పట్నం వారానికి వచ్చిన భక్తులు శనివారం ధూళి దర్శనం, ఆదివారం బోనాలు, పట్నాలు, సోమవారం పెద్ద పట్నం, అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. మల్లన్న ఆలయ ఒగ్గు పూజారులు పట్నం వేసి కార్యక్రమాన్ని ప్రారంభించడంతో హైదరాబాద్ ఒగ్గు పూజారులు పంచవర్ణాలు (తెలుపు, పసుపు, నీలి, ఎరుపు, ఆకుపచ్చ) రంగుల పిండితో పెద్ద పట్నం వేశారు. పంచ పల్లవాలు (మామిడి, జువ్వి, రాగి, మేడి, మర్రి) కట్టెలను వరుసగా పేర్చి అగ్నిగుండంగా తయారు చేశారు. అర్చకులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పెద్దపట్నం, అగ్నిగుండం వరకు తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దపట్నం, అగ్నిగుండాలను ఆలయ అర్చకులు దాటిన వెంటనే భక్తులు దాటారు. ఆలయంలో మల్లికార్జునస్వామి, బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలను దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం మేరకు శివసత్తులు, ఘనాచార్యులకు ఆలయ ఈవో బాలాజీ, ఆలయ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు కండువా, జాకెట్ ముక్కలతోపాటు స్వామి వారి బండారిని పంపిణీ చేశారు. అంతకు ముందు భక్తులు పసుపును ఒళ్లంతా పూసుకోవడంతో పాటు ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించడంతో పాల్గొనేందుకు భక్తులు గంటల పాటు వేచి ఉన్నారు.




కొమురవెల్లిలో పెద్దపట్నం, అగ్నిగుండం

## రోడ్లకు నిధులు మంజూరు చేయాలి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే

దుబ్బాక, జనవరి 22: దుబ్బాక నియోజకవర్గంలోని రహదారులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం రాత్రి ఆర్‌అండ్‌బీ (రోడ్లు, భవనాల) శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆయన కలిశారు. ఈ విషయంపై సోమవారం ఆయన దుబ్బాక విలేకరులకు ఫోన్‌లో వివరించారు. దుబ్బాక నియోజకవర్గంలో మెట్టు-దౌల్తాబాద్ హైలేవల్ బ్రిడ్జితోపాటు వయా పద్మనాభంపల్లి, తిమ్మాపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి సీఆర్‌ఎఫ్ నిధులు రూ.25 కోట్లు విడుదల చేయాలని కోరారు. మొండిచింత-బేగంపేట వరకు ఉన్న సింగల్ రోడ్డును డబుల్‌గా విస్తరించేందుకు రూ. 7 కోట్లు మంజూరు చేయాలన్నారు. చేగుంట-బోనాల రోడ్డు నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరు చేయాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. సుమారు రూ.33 కోట్లతో పలు రహదారుల నిర్మాణం, విస్తరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలు మంత్రికి అందించానన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.



ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

## కేసీఆర్ గొప్ప భక్తితత్పరుడు

చేర్యాల, జనవరి 22 : బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గొప్ప భక్తితత్పరుడని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠలో భాగంగా మండలంలోని దొమ్మాట రామాలయంలో సోమవారం ఆయన ప్రత్యేక పూజలు చేసి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధి, భక్తుల వసతులపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. దీంతో ఆలయాల ఆదాయం పెరిగిందన్నారు. దేశంలోనే యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని అద్భుతంగా నిర్మించారని గుర్తుచేశారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయాలకు నిధులు కేటాయించి, ధూపదీప నైవేద్యాల కోసం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించడంతో పాటు ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలిపల్లి సుభాషిణిరెడ్డి, ఎంపీటీసీ ముచ్చెంతల వినోదాచుక్కారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, గ్రామశాఖ అధ్యక్షుడు ఒంటెల్పుల చంద్రం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఉల్లెంగల ఏకానందం, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, పాల బాలరాజు, నండిమింటి శ్రీనివాస్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు పాల్గొన్నారు.



దొమ్మాటలోని రామాలయంలో పూజల్లో పాల్గొన్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలి



మాసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న బికుభాయ్‌పటేల్, డా. శ్రీకాంత్, మాధవి, డీఈవోలు

- మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్
- మాసాయిపేట ప్రభుత్వ పాఠశాలలో సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ ప్రారంభం
- శాంతా ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎన్‌ఫీల్డ్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్మాణం

వెల్దుర్తి, జనవరి 22: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేదల విద్యాభివృద్ధికి దాతల సహకారం ఎంతో గొప్పదని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని మాసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అంతిరెడ్డిగారి కేశవరెడ్డి జ్ఞాపకార్థం బ్రిటన్‌కు చెందిన శాంతా ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎన్‌ఫీల్డ్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్మించిన సైన్స్‌ల్యాబ్, లైబ్రరీని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు విజయ్‌భాయ్‌పటేల్, బికుభాయ్ పటేల్, శశిబెన్‌పటేల్, స్మితబెన్‌పటేల్, డాక్టర్ శ్రీకాంత్, ప్రణతి, మాధవిలతో కలిసి డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన సైన్స్ పరికరాలు, ఇన్నోవేషన్‌లను సందర్శించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈవో రాధాకిషన్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు వెళ్లే ఆర్థిక స్తోమత లేని ఎంతో మంది నిరుపేదలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. నేడు ప్రభుత్వ బడులు ఎంతో అభివృద్ధి చెందాయని, ఎంతోమంది దాతలు ముందుకు వచ్చి తమ దాతృత్వాన్ని చాటుతూ పాఠశాలలు, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మాసాయిపేట పాఠశాలలో సైన్స్‌ల్యాబ్, లైబ్రరీలతో పాటు ఫర్నిచర్, ల్యాబ్ పరికరాలు, పుస్తకాలను బహూకరించడం అభినందనీయమన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విజయ్‌భాయ్‌పటేల్, బికుభాయ్‌పటేల్, డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎలాంటి వసతులు, సౌకర్యాలు లేని కాలంలో తాము ఎంతో కష్టపడి చదువుకొని విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే చిన్నారులు కష్టపడి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, సొసైటీ డైరెక్టర్ నర్సింహులు, ఉపసర్పంచ్ నాగరాజు, నాయకులు గంగుమల్ల నర్సింహారెడ్డి, సిద్ధిరాంలుగౌడ్, నాగరాజులతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జగమంతా రామోత్సవం

- ఉప్పొంగిన భక్తిభావం
- మార్మోగిన రామ నామస్మరణ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- పలు చోట్ల అన్నదానాలు

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా శ్రీరామ నామస్మరణ మార్మోగింది. ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. గ్రామాల్లో శోభాయాత్రలు, కోలాటం, మేళతాళాలు వైభవంగా జరిగాయి. పలు చోట్ల అన్నదానం చేశారు. బాలరాముడి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు వీలుగా ఆయా గ్రామాల్లో బిగ్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. రాముడు, సీత, హనుమాన్ వేషధారణలతో చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు.

**- సిద్దిపేట, జనవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**




జహీరాబాద్ పట్టణంలో బాల రాముడి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

## గొర్రెల పంపిణీపై నీలినీడలు

- రెండో విడతపై సందిగ్ధం
- డీడీలు కట్టి ఎదురుచూస్తున్న గొల్లకుర్మలు
- ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టని ప్రభుత్వం
- అయోమయంలో లబ్ధిదారులు
- 2017లో శ్రీకారం చుట్టిన కేసీఆర్
- మొదటి విడతలో 12,997, రెండో విడతలో 642 మందికి పంపిణీ
- 26 తర్వాత ఆందోళనకు సిద్ధమని హెచ్చరిక

| | |
|---|---|
| మొదటి విడత యూనిట్ల లక్ష్యం: | 20,182 |
| పంపిణీ చేసినవి: | 12,997 |
| రెండో విడత టార్గెట్: | 7234 |
| అందించినవి: | 642 |



మెదక్, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : గొల్ల కుర్మల ఆర్థికాభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. మొదటి విడత పకడ్బందీగా అమలు చేయడంతోఎంతో మందికి లబ్ధి చేకూరింది. రెండో విడతలో మరికొంత మందికి పంపిణీ చేసే క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పంపిణీ నిలిచిపోయింది. మెదక్ జిల్లాలో మొదటి విడతలో 20,182 మంది దరఖాస్తు చేసుకోగా, 12,997 మందికి గొర్రెల యూనిట్ల పంపిణీ చేశారు. రెండో విడతలో 7234 లక్ష్యం కాగా, 6774 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 2584 మంది లబ్ధిదారులు డీడీలు చెల్లించగా, 642 మంది లబ్ధిదారులకు మాత్రమే గొర్రెలు అందజేశారు. మిగతా 1942 మంది పెండింగ్‌లిస్ట్‌లో ఉన్నారు. ఒక యూనిట్ ధర రూ.1,75,000 ఉండగా, లబ్ధిదారుడి వాటా కింద 25 శాతం(రూ.43,750) చెల్లించాలి.

**2017లో శ్రీకారం...**

కులవృత్తులకు పునరుజ్జీవం పోయాలనే లక్ష్యంతో కేసీఆర్ సర్కార్ 2017లో గొల్లకుర్మలకు గొర్రెల పంపిణీ పథకానికి శ్రీ కారం చుట్టింది. 75 శాతం రాయితీపై ఒక్కో యూనిట్ కింద 20 గొర్రెలు, ఒక పొట్టేలును పంపిణీ చేసింది. గతంలో యూనిట్ విలువ రూ.1.25 లక్షలు కాగా, లబ్ధిదారుడి వాటా రూ.31,250, మిగతా రూ.93,750లను సబ్సిడీ కింద ప్రభుత్వమే చెల్లించింది. అయితే, మెదక్ జిల్లాలో 2017 మే, జూన్ నెలల్లో ఒకేసారి మొదటి, రెండో విడత కోసం లబ్ధిదారులను ఎంపిక చేసింది. మొదటి విడత లక్ష్యం 20,182 కాగా, అధికారులు 12,997 యూనిట్లు పంపిణీ చేశారు. రెండో విడతలో 7234 మందికి అందజేయాల్సి ఉండగా, కేవలం 642 మంది లబ్ధిదారులకు మాత్రమే పంపిణీ చేశారు.

**ఇంటికి వెళ్లి నిర్ధారణ..**

రెండో విడత వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు పకడ్బందీగా పూర్తి చేశారు. ప్రతి గ్రామంలోని రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయిలో సర్పంచ్, సొసైటీ ఇన్‌చార్జి, పంచాయతీ కార్యదర్శి, మండల పశు వైద్యాధికారి, ఆ శాఖ ఏడీ విచారణ చేశారు. మొదటి విడతలో లబ్ధిదారుడి వాటాను డీడీ రూపంలో తీసుకోగా, ఆ తర్వాత ఆర్టీజీఎస్ విధానంలో లబ్ధిదారుడి ఖాతా నుంచి జమ చేశారు. వర్చువల్ పద్ధతిలో లబ్ధిదారుడికి ఐడీ ఇచ్చి, ఆ ఐడీకి ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశారు.

**26 తర్వాత ఆందోళన...**

ఈనెల 26 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి గొర్రెల పంపిణీ కార్యక్రమ విధివిధానాలు (గైడ్ లైన్స్) రాకుంటే జిల్లాలో గొర్రెల కాపరుల ఆధ్వర్యంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఉద్యమాన్ని చేపడుతామని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు వి.దేవరాజ్ హెచ్చరించారు. 2019లో రెండో విడతను ప్రారంభించగా, కొన్ని నెలల క్రితం గొర్రెల పంపిణీకి డీడీలు కట్టామని కానీ ఇంతవరకు గొర్రెల పంపిణీ లేదా నగదు బదిలీ చేయకపోవడం విచారకరమన్నారు.

**రెండో విడతలో 642 మందికి పంపిణీ చేశాం**

రెండో విడతలో 7243 మంది లబ్ధిదారులకు గొర్రెలు అందించాలని లక్ష్యం కాగా, 6774 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2584 మంది డీడీలు చెల్లించారు. ఇందులో 642 మందికి గొర్రెలను పంపిణీ చేశాం. ఇంకా 1942 మందికి పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే మిగతావారికి కూడా పంపిణీ చేస్తాం.

**- విజయశేఖర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, మెదక్**